## కమ్మేసిన పొగ మంచు

వాతావరణ మార్పులతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో పొగ మంచు కమ్మేసింది. చలి తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్నది. రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో జాతీయ రహదారిపై రాత్రి, తెల్లవారుజామున దట్టమైన పొగ మంచు కమ్మేసింది. వాహనదారులకు ప్రయాణం కష్టంగా మారింది. ఉదయం 11 గంటలైనా వీడకపోవడంతో వాహనదారులు లైట్లు వేసుకొని డ్రైవింగ్ చేయాల్సిన పరిస్థితి నెలకొన్నది.

- ఆదిలాబాద్ రూరల్, నవంబర్ 29



రహదారిపై కమ్మేసిన పొగమంచు



హస్నాపూర్ గ్రామంలో అలుగుపారుతున్న చెక్ డ్యాం

## చెక్‌డ్యాంకు జలకళ..

తాంసి మండలం హస్నాపూర్ గ్రామంలో రూ.కోటి 35 లక్షలతో నిర్మించిన చెక్‌డ్యాం జలకళను సంతరించుకున్నది. ఇక్కడ భూగర్భజలాల స్థాయి గణనీయంగా పెరిగింది. చెక్ డ్యాంల కింద ఉన్న భూముల రైతులకు రెండు పంటలు పండుతుండడం.., అలుపారడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతున్నది.

- తాంసి, నవంబర్ 29

## ఆదర్శ మహిళా పోలింగ్ కేంద్రం

**బోథ్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో** ఆదర్శ మహిళ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి చాహత్‌బాజ్ పాయ్ పోలింగ్ కేంద్రాన్ని సుందరంగా తీర్చిదిద్దించారు. మహిళలకు స్వాగతం పలుకుతూ ఓటు వేయాలని స్వాగత బోర్డు ఏర్పాటు చేశారు. పూలతో అందంగా అలంకరించారు. మహిళలంతా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆర్‌వో కోరారు.

- బోథ్, నవంబర్ 29

బోథ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం




## లక్ష్మీనారాయణ స్వామి అశ్వవాహన సేవా

జైనథ్, నవంబర్ 29 : శ్రీ లక్ష్మీనారాయణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయ ఆవరణలో అశ్వవాహన సేవా నిర్వహించారు. ఈ సందర్భంగా రథంపై దేవతా మూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించి, ఊరేగింపు తీశారు. దారి పొడవునా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. పూజలు నిర్వహించారు.



రథంపై దేవతామూర్తులను ఊరేగిస్తున్న దృశ్యం

# ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం..



ఉట్నూర్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యపు రాశులు

ఉట్నూర్ రూరల్, నవంబర్ 29 : ఉట్నూర్ మండలంలో వరి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఉట్నూర్ మండలంలోని గంగన్నపేట్ గ్రామంలో శాంతి నగర్ గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో కేంద్రాన్ని ప్రారంభించారు. ఇప్పటికే రైతులు చాలా మేరకు ధాన్యాన్ని ఇక్కడికి తరలించారు. చాలా చోట్ల రైతులు హార్వేస్టర్ సాయంతో వరి కోతలు చేపడుతున్నారు. రెండు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండడంతో ప్రస్తుతం నిలిపివేశారు. కోతలు పూర్తయిన వెంటనే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తరలించారు. కొనుగోలు కేంద్రంలో ఆలస్యం చేయకుండా తేమ శాతం చూసి, తూకం వేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## తుకారాంను ఆదర్శంగా తీసుకోవాలి



నివాళులర్పిస్తున్న ఎంపీపీ జైవంత్‌రావ్

ఉట్నూర్ రూరల్, నవంబర్ 29 : స్వర్గీయ మడావి తుకారాంను ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్ పిలుపునిచ్చారు. తుకారాం 25వ వర్ధంతి సందర్భంగా ఉట్నూర్ మండలంలోని ఎక్స్‌రోడ్డు వద్ద బుధవారం ఆయన విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. మడావి తుకారాం ఆదివాసుల్లో ఉన్నత చదువులు చదివి, కలెక్టర్‌గా ఎదిగాని పేర్కొన్నారు. తుకారాం కుటుంబ సభ్యులు, జిల్లా సర్‌మేడి మెస్రం దుర్గు పటేల్, సలాం శ్యాంరావు, రాజ్‌గోండ్ సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగం విషంరావు, కోశాధికారి ఆర్క ఓమేశ్, మండలాధ్యక్షుడు మెస్రం ఆనందరావ్, జిల్లా నాయకులు అర్క గంగారాం, లక్కటిపేట్ గ్రామ పటేల్ పర్చకి తెలంగ్‌రావు, మహాజన్ తొడసం జనార్దన్, దేవారి అర్క సెడ్మారావు, నాయకులు మవావి జల్పత్‌రావు, మడావి భీంరావ్, వివిధ సంఘాలు, రాజకీయ, ఆదివాసీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సఖీ కేంద్రం సేవలపై అవగాహన

ఎదులాపురం, నవంబర్ 29 : మహిళలపై హింసకు వ్యతిరేకంగా అంతర్జాతీయ ప్రచారోద్యమం కార్యక్రమంలో భాగంగా సఖీ కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బొక్కలగూడలో మగ్గం వర్క్ శిక్షణ తీసుకుంటున్న మహిళలు, బంగారిగూడలోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సఖీ కేంద్రం సెంటర్ అడ్మినిస్ట్రేటర్ సరస్వతి మాట్లాడుతూ.. మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, లింగ వివక్షతను నిర్మూలించాలని సూచించారు. సఖీ కేంద్రం సేవలను వివరిస్తూ కేంద్రానికి వచ్చిన బాధితుల వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. అత్యవసర సమయంలో 100,181,1098,14567,1930 నంబర్లకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో కేస్ వర్కర్ నాగమణి, సుకేష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




అవగాహన కల్పిస్తున్న సఖీ కేంద్రం నిర్వాహకురాలు సరస్వతి